సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



బస్సులు లేక విద్యార్థుల తిప్పలు

పల్లె వెలుగు బస్సు పల్లెల్లో కానరావడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

IIలో ▸



నవరాత్రులకు సిద్ధం

శ్రీదేవి శరన్నవరాత్రులకు సమయం ఆసన్నమైంది. రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లావ్యాప్తంగా సందడి మొదలైంది.

IIలో ▸



ఈవీఎం గోడౌన్ తనిఖీ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్స్‌లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ సీహెచ్ **నాగరాణి శుక్రవారం** తనిఖీ చేశారు.

వైద్య విద్య ప్రైవేటుపై కన్నెర్ర

పేదలకు వైద్య విద్యను మిథ్యగా మారుస్తూ చంద్రబాబు సర్కారు తలపెట్టిన ప్రైవేటీకరణ నిర్ణయంపై జనాగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన చలో మెడికల్ కళాశాల పిలుపునకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాలకొల్లుకు చేరుకుని ప్రభుత్వ తీరుపై కదం తొక్కారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాదయాత్రలు, బైఠాయింపులతో నిరసన తెలిపారు.

కూటమి కుట్రలపై జనాగ్రహం

- చలో మెడికల్ కళాశాల కార్యక్రమం విజయవంతం
- కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- జిల్లా నలుమూలల నుంచి భారీగా పాలకొల్లుకు రాక
- మెయిన్‌రోడ్డు నుంచి కళాశాల ప్రాంగణానికి పాదయాత్ర
- కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ బైఠాయించి నిరసన



దగ్గులూరులో మెడికల్ కళాశాల ఫౌండేషన్ వద్ద నిరసన తెలుపుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, సమన్వయకర్తలు గోపి, వెంకట్రాయుడు, అబ్జర్వర్ మురళీకృష్ణంరాజు

సాక్షి, భీమవరం/పాలకొల్లు సెంట్రల్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలన్న కూటమి నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, ఉండి, నరసాపురం నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాలకొల్లు మండలం దగ్గులూరులోని మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంగణానికి చేరుకున్నారు. తొలుత భీమవరం రోడ్డు నుంచి కళాశాల ప్రాంగణం వరకు కిలోమీటరు మేర ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాదయాత్ర చేశారు.

కూటమి కుట్రలు ఛేదిద్దాం

పేదలకు వైద్య విద్యను చేరువచేయడం, మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు ఒక వైద్య కళాశాల నిర్మాణం తలపెట్టిన తీరు.. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భగ్నం చేస్తూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు కూటమి చేస్తున్న కుట్రలను పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, జిల్లా అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, పాలకొల్లు, భీమవరం కో–ఆర్డినేటర్లు గుడాల శ్రీహరిగోపాలరావు, చినమిల్లి వెంకటరాయుడు, ఇతర నేతలు ప్రజలకు వివరించారు. ఏడాదికాలంగా నిధులు విడుదల కాక వైద్య కళాశాల భవన నిర్మాణాలు నిలిచిపోయిన తీరు, నిర్మాణ సంస్థ మెటీరియల్‌ను తరలించుకుపోవడం తదితర వివరాలను ప్రత్యక్షంగా చూపించారు. నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు బందన పూర్ణచంద్రరావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అరిగేల అభిషేక్, పార్టీ నేత యడ్ల తాతాజీ, ఎంబీసీ మాజీ అధ్యక్షులు పెండ్ర వీరన్న, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడి విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, స్టేట్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు నిదర్శనం

కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలనకు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం నిదర్శనమని భీమవరం కో–ఆర్డినేటర్ చినమిల్లి వెంకట్రాయుడు అన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులు మెడిసిన్ చదవాలంటే ప్రభుత్వ వైద్య కళాశాల వల్లే సాధ్యమవుతుందన్నారు. మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేసి సీట్లు అమ్ముకోవాలన్న ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

జగన్ సంకల్పంతోనే సాకారం

పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మాజీ సీఎం జగన్ పాలకొల్లుకు మెడికల్ కళాశాలను మంజూరుచేశారని పాలకొల్లు సమన్వయకర్త గుడాల గోపి అన్నారు. అప్పట్లో పదేపదే మెడికల్ కళాశాల ఆవరణకు వచ్చి లేనిపోని హడావుడి చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కసారి కూడా కళాశాలను సందర్శించలేదన్నారు. కళాశాల పనుల కోసం తట్టమట్టి కూడా వేయించలేకపోయారని విమర్శించారు.

పేదలకు విద్యను దూరం చేసేలా..

పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మెడికల్ కళాశాల ఉండాలనే సంకల్పంతో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. రూ.8,500 కోట్ల నాబార్డ్ నిధులతో 820 ఎకరాలు కొనుగోలు చేసి 2021 మే 31 నిర్మాణ పనులకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారన్నారు. దగ్గులూరులో 60 ఎకరాలు సేకరించి రూ.475 కోట్ల వైద్య కళాశాల నిర్మాణ పనులు చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.83 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనలో మంత్రి పాత్ర ఉండవచ్చునన్నారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఉండి కూడా ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

మెడికల్ సీట్లు అమ్ముకునేందుకే..

పేదలకు అందుబాటులో ఉండాల్సిన వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేసి మెడికల్ సీట్లు విక్రయించుకోవాలని కూటమి నేతలు చూస్తున్నారని జిల్లా అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు విమర్శించారు. పేదలు గొప్పవాళ్లు అవ్వకూడదు, వారు చదువుకోకకూడదు, వారు అభివృద్ధి చెందకూడదనే దురుద్దేశం చంద్రబాబులో కనిపిస్తుందన్నారు. ఏ సీఎం అయినా మెడికల్ సీట్లు రావాలని చూస్తే రాష్ట్రంలో మాత్రం అమ్ముకోవాలని చూస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలిస్తాం, నిరుద్యోగ భృతి కల్పిస్తామంటూ వంచించిన కూటమి నేతలు త్వరలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.



మెడికల్ కళాశాల వద్ద మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు. చిత్రంలో సమన్వయకర్తలు గోపి, వెంకట్రాయుడు, అబ్జర్వర్ మురళీకృష్ణంరాజు



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు, పాలకొల్లు సమన్వయకర్త గోపి



ప్లకార్డులతో ర్యాలీగా వస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, భీమవరం సమన్వయకర్త వెంకట్రాయుడు

న్యూస్‌రీల్

విద్యుత్ ఉద్యోగుల దీక్షలు



దీక్షలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపులో భాగంగా భీమవరం విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అపరిమితమైన మెడికల్ పాలసీని అమలు చేయాలని, 2004 వరకు ముందు విధుల్లో చేరిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల మాదిరి పీజీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రేడ్–2 లైన్‌మెన్‌లను పర్మినెంట్ చేయాలని, బకాయిపడిన కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల్లో ఖాళీలు పోస్టులు భర్తీ చేయాలని, పని ప్రమాణాల ప్రకారం అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

బాలలను తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): బాలలను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ–బాలల కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం, 2024 అంశంపై ఉమ్మడి జిల్లాలోని మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ప్యానల్ న్యాయవాదులతో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలన్నారు. చట్టంతో విభేదించిన బాలలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, పునరావాసం కల్పించడానికి జిల్లా న్యాయ సేవధికార సంస్థ కృషి చేస్తోందన్నారు. డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ, విభిన్న ప్రతిభావంతుల శాఖ అదనపు డైరెక్టర్ రామ్‌కుమార్, శిశు సంరక్షణ అధికారులు సీహెచ్ సూర్యచక్రవేణి, ఆర్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్సులు

ఏలూరు(మెట్రో): ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో తాత్కాలికంగా దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు వచ్చేనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారుని ఆధార్ కార్డు, పాన్ కార్డు, చలానా ఒరిజినల్, జీఎస్టీ రశీదు జతచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు అనుసరించి లైసెన్సులు మంజూరు చేస్తామన్నారు.

ఆఖరి మజిలీకి అన్నీ అవస్థలే



కొండేపూడిలో శ్మశాన వాటికకు పడవపై తీసుకువెళుతున్న దృశ్యం

పాలకోడేరు: పాలకోడేరు మండలం కొండేపూడి గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు జీ అండ్ వీ కెనాల్ దాటాలి, లేదా రెండు కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాలి. ఈ కాలువపై వంతెన నిర్మిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడం, అధికారం చేపట్టిన తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎవరైనా కన్నుమూస్తే మృతదేహంతో కాలువ దాటడం గ్రామస్తులకు కష్టంగా మారింది. మృతదేహాన్ని పడవల మీద తీసుకువెళ్లాల్సి వస్తోంది. ఆ సమయంలో కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుత మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు చంటిరాజు కొండేపూడి నుంచి ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీ పీఠాన్ని అధిరోహించారు. ఆయన కూడా ఇక్కడ వంతెన నిర్మిస్తానని హామీ ఇచ్చారు. పదవీకాలం పూర్తవుతున్నా ఇప్పటికీ వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. శుక్రవారం గ్రామానికి చెందిన పట్టెం సత్యానందం (45) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు జీ అండ్ వీ కెనాల్‌పై పడవపై ప్రమాదకరంగా తీసుకువెళ్లారు.

అడుగడుగునా పోలీసు ఆంక్షలు

ఏలూరు టౌన్ : ప్రభుత్వ కాలేజీల ప్రైవేటీకరణపై కొద్ది రోజులుగా వైఎస్సార్‌సీపీ పలు కార్యక్రమాలు చేస్తుండటం, ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే వచ్చిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళుతుండటంతో కూటమి నేతల్లో భయం పట్టుకుంది. దీంతో ఏలూరులో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం విజయవంతం అయితే ప్రజలు ఛీకొడతారనే ఉద్దేశంతో అడ్డుకునే కుట్రలు చేశారు. పోలీస్ అధికారుల అండదండలతో ఈ కార్యక్రమానికి ఆంక్షలు విధించారు. పాతబస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు మెడికల్ కాలేజీ, డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రాంగణంలోకి వెళ్లేందుకు అనుమతించలేదు. బారికేడ్లు పెట్టడంతోపాటు భారీఎత్తున పోలీస్ అధికారులు, సిబ్బంది, ఏఆర్ పోలీసులను మోహరించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, వన్ టౌన్ ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు, సీఐ వెంకటేశ్వరరావు, పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, 20 మంది ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు.



ఏలూరులో మెడికల్ కాలేజీకి వెళ్లే మార్గంలో పోలీసు జీపు అడ్డుపెట్టిన దృశ్యం



వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



ప్రజలను అడ్డుకుంటున్న దృశ్యం

తల్లి కథ సుఖాంతం

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: పొంగుటూరులో తల్లి కథ సుఖాంతం అయ్యింది. 'సాక్షి'లో శుక్రవారం 'కన్న బిడ్డలకు భారం కాలేక ఆత్మహత్యాయత్నం' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎస్.నాగరాజు పొంగుటూరు గ్రామానికి వెళ్లి వృద్ధురాలు మద్దాల రంగమ్మ విషయంపై ఆరా తీశారు. ఆమెతో మాట్లాడి అనంతరం సర్పంచ్ పసుపులేటి రాంబాబుతో కలిసి వృద్ధురాలిని ఆమె కుమారుడు శేషారావుకు అప్పగించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రంగమ్మకు కొంత మతిస్థిమితం లేక పోవడంతో ఆమె ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఈ నేపథ్యంలో ఆమె కొడుకు, కోడలికి రంగమ్మ విషయంలో జాగ్రత్తలు తీసుకోమని చెప్పామన్నారు. అలాగే రంగమ్మకు సంబంధించి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించామన్నారు.



పొంగుటూరులో రంగమ్మను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న తహసీల్దార్

ఎన్నికల హామీలను అమలు చేయాలి

చింతలపూడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన, ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి యాత్ర శుక్రవారం చింతలపూడి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 నెలల పరిపాలనలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. పీఆర్సీ కమిషన్ నియమిస్తామని, పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లిస్తామని, ఉపాధ్యాయులకు మరింత గౌరవం పెంచుతామని చంద్రబాబు వాగ్దానాలు చేసి మోసగించారన్నారు. ఐఆర్ ప్రకటించాలని, యాప్‌ల భారం తగ్గించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు పూరేటి శ్రీనివాసరావు, అప్పారావు, దామోదర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రణభేరి యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

25న భారీ బహిరంగ సభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూటీఎఫ్ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 25న గుంటూరు జిల్లాలో 10 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి తెలిపారు. యూటీఎఫ్ రణభేరి ముగింపు కార్యక్రమం ఏలూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.సుభాషిణి, ఎస్.శ్రీదేవి, ఎస్.జ్యోతిబసు, టీవీజీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల లక్ష్యం సాధించాలి

భీమవరం: మద్యం అమ్మకాల్లో లక్ష్య సాధనకు షాపు యజమానుల ఆర్డర్ ప్రకారం డిపోల నుంచి మద్యం సకాలంలో సరఫరా అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ శాఖ ప్రగతిపై ఎక్సైజ్ సర్కిళ్ల వారీగా ఆమె సమీక్షించారు. మద్యం షాపుల వద్ద సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని, వాటర్ ప్యాకెట్లను పూర్తిగా నిషేధించాలన్నారు. జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో సుంకం చెల్లించని మద్యం సరఫరాపై 10 కేసులను నమోదు చేయగా 1,126 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్టు చెప్పారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగ ప్రభుకుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి, అజయ్ కుమార్, సీఐలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

నేడు బీచ్ క్లీనింగ్ క్యాంపెయిన్

భీమవరం (ప్రకాశంచౌక్): పేరుపాలెం బీచ్‌లో శనివారం బీచ్ క్లీనింగ్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జాతీయ తీరప్రాంత మిషన్ పథకం కింద కేంద్ర పర్యావరణ, అటవీ–వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని తీరప్రాంత రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలతో సన్నిహిత సహకారంతో సెప్టెంబర్ 20న అంతర్జాతీయ తీరప్రాంత శుభ్రపరిచే దినోత్సవం నిర్వహించాలని ప్రతిపాదించినట్టు తెలిపారు. దీనిలో భాగంగా తీరప్రాంత శుభ్రపరిచే దినోత్సవాన్ని నిర్వహించడానికి జిల్లాలో పేరుపాలెం బీచ్‌ను గుర్తించామన్నారు. బీచ్ క్యాంపెయిన్ నిర్వహణకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా భీమవరం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వై.దోసిరెడ్డిని నియమించామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల వినతి

భీమవరం (ప్రకాశంచౌక్): విపరీతమైన పని భారం, తీవ్ర ఒత్తిళ్లతో ఇబ్బందులు పడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పశ్చిమగోదావరి జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక సభ్యులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణికి ఉద్యమ కార్యాచరణ నోటీసు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులను సర్వే విధుల నుంచి విముక్తి కల్పించి ఆయా మాతృశాఖలకు అప్పగించాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, పెండింగ్ బకాయిల విడుదల, సచివాలయ సిబ్బందిని జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ సభ్యులు షేక్ ఉమర్ అలీషా, వై.సురేష్, షహనాజ్, కీర్తి, ఎం.వెంకటేష్, కె.సాయికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా జోనైజేషన్‌కు ప్రతిపాదనలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్వా జోనైజేషన్ నిర్ణయంలో కచ్చితత్వంతో కూడిన ప్రతిపాదనలను సిఫార్సు చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సంబంధిత కమిటీలను ఆదేశించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన జిల్లాస్థాయి ఆక్వా జోనైజేషన్ ప్రకటన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రతిపాదిత నివేదికను పరిశీలించి మార్పులు, చేర్పులు, తిరస్కరణకు గల కారణాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్యాయత్నం



కొయ్యలగూడెం మెయిన్ సెంటర్‌లో ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మద్యం మత్తులో యువకుడు శుక్రవారం రాత్రి మెయిన్ సెంటర్‌లో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. కొయ్యలగూడెంకు చెందిన కంకర రాజు నాగేంద్ర అశోక్ నగర్‌లోని తమ ప్రాంతంలో డ్రెయిన్ సదుపాయం లేదని, సీసీ రోడ్లు నిర్మించలేదంటూ హంగామా సృష్టించాడు. పంచాయతీ పట్టించుకోకపోవడంతో తమ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని వాపోయాడు. లే అవుట్లలో తాము నిర్మించుకున్న ఇళ్లకు పంచాయతీ ద్వారా అభివృద్ధి జరగదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారని ఆరోపించాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి పడిపోవడంతో పోలీసులు స్థానికులు అతనిని హాస్పటల్‌కు తరలించారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం: ప్రేమ పేరుతో బాలికను మోసగించగా కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్ టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. భీమవరం పట్టణానికి చెందిన 14 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతుండగా పట్టణానికే చెందిన 22 ఏళ్ల యువకుడు ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పి మోసగించాడు. విషయం బాలిక తండ్రికి తెలియడంతో శుక్రవారం ఫిర్యాదు చేశారని దీనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త మోసగించాడని ఫిర్యాదు

భీమవరం: వేరే యువతిని పెళ్లిచేసుకుని తనను, పిల్లల్ని మోసం చేశాడంటూ భార్య తన భర్తపై ఫిర్యాదు చేసింది. భీమవరం ఒకటో పట్టణానికి చెందిన బి.నాంచారావు భార్య, ఇద్దరు పిల్లలను విడిచిపెట్టి ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన మరో యువతిని పెళ్లిచేసుకుని వెళ్లిపోయాడని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

టి.నరసాపురం: ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై ఎం.జయబాబు వివరాల ప్రకారం.. మండలంలోని మక్కినవారిగూడెంకు చెందిన తెల్లమేకల సత్యనారాయణ (37)కు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. మద్యం సేవించి వచ్చి తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. గతంలో ఇలాగే జరిగినప్పుడు భార్య పుట్టింటికి వెళ్లిపోగా, రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదే క్రమంలో రెండు రోజుల క్రితం భార్యతో గొడవ పడగా, ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 19న ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు గమనించి చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్షరమే ఆయుధం

అక్రమ కేసులు దారుణం



కూటమి ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తూ, ప్రజలకు వాస్తవాలను వివరిస్తున్న సాక్షిపై అక్రమ కేసులు దారుణం. సాక్షి ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు బనాయించి వాస్తవాలను బయటకు రానీయకుండా ఆపలేరు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ప్రజాస్వామ్యంలో పత్రికది కీలకపాత్ర. వాటిని ప్రజలకు దూరం చేస్తే ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారు.

– గూడూరి ఉమాబాల, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్

కుట్ర పూరితంగా కేసులు



విలేకరుల సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు మాట్లాడిన వ్యాఖ్యలను ప్రచురించిన సందర్భాల్లో కూడా పాత్రికేయులపై కేసులు నమోదు చేస్తుండడం గతంలో ఎన్నడూ లేదు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయ రంగంపై కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించడం బాధాకరం. సమాజంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజంపై ఉక్కుపాదం మోపేలా కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తుండడం శోచనీయం.

– కారుమూరి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వర్కింగ్ అధ్యక్షుడు

బస్సులు లేక విద్యార్థుల తిప్పలు

- పల్లెల్లో కానరాని పల్లె వెలుగు బస్సులు
- కాలేజీలకు ఆలస్యంగా రావడంతో క్లాసులు మిస్



ముదినేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు విద్యార్థుల పాట్లు (ఫైల్)

కైకలూరు: పల్లె వెలుగు బస్సు పల్లెల్లో కానరావడం లేదు. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో మొత్తం 110 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ఏలూరు, కృష్ణ జిల్లా విజయవాడ వయా గుడివాడ, ముదినేపల్లి, కలిదిండి మీదుగా భీమవరం, ఏలూరు నుంచి వయా కైకలూరు ఆకివీడు, ఉండి మీదుగా భీమవరం, నరసాపురం ప్రధాన ఆర్టీసీ రూట్లుగా ఉన్నాయి. ఏలూరు, గుడివాడ, భీమవరం, నరసాపురం డిపోల నుంచి బస్సులు తిరుగుతున్నాయి. ఏలూరు – నరసాపురంలో రూటులో 6 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, ఏలూరు – భీమవరం రూటులో 15 పల్లె వెలుగు, గుడివాడ – కైకలూరులో 11 పల్లె వెలుగు సర్వీసులతో పాటు ముదినేపల్లి బస్టాండ్ నుంచి వయా సింగరాయపాలెం, కలిదిండి, కాళ్ళ మీదుగా భీమవరం రూట్లు ఉన్నాయి.

ప్రధాన రూట్లలో మాత్రమే ఆర్టీసీ బస్సులు ఉండడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చదువుల కోసం కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల నుంచి విద్యార్థులు వస్తారు. కలిదిండి, కోరుకొల్లు ప్రాంతాల నుంచి సమయానికి బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం ఉండే కుటుంబాలు ఆటో చార్జీల భారాన్ని భరించలేకపోతున్నారు. అనేక మంది విద్యార్థులు బస్సుల కోసం వేచిచూసి ఉదయం 10.30కి కాలేజీలకు రావడంతో క్లాసులు మిస్ అవుతున్నారు. ఎక్కువ మంది రవాణా సౌకర్యం లేక డ్రాపవుట్స్‌గా మారుతున్నారు. బస్సుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ అప్పలనాయుడు దృష్టికి కాలేజీ సిబ్బంది తీసుకెళ్లారు.

ఈ రూట్లలో బస్సు అవసరం..

- మండవల్లి మండలంలో గోపాలపురం నుంచి ఇంగిలిపాకలంక వరకు వస్తున్న బస్సును ఏలూరు వరకు పొడిగించాలి.
- ముదినేపల్లి మండలం చినకామనపూడి, చిగురుకోట, పెదకామనపూడి మీదుగా వడాలి వరకు బస్సు సౌకర్యం కల్పించాలి.
- కలిదిండి మండలంలో లోడిదిలంక, తాడినాడ, చినతాడినాడ, కొండూరు, కాళ్ళపాలెం మీదుగా కలిదిండి వరకు బస్సు ఏర్పాటు చేయాలి.
- కలిదిండి నుంచి కోరుకొల్లు మీదుగా కైకలూరుకు షటిల్ సర్వీసు ఏర్పాటు చేయాలి.
- కైకలూరు మండలం ఉప్పుటేరు సెంటర్ నుంచి రామవరం, దొడ్డిపట్ల, శీతనపల్లి, వరహాపట్నం, గోపవరం నుంచి కైకలూరు వరకు బస్సు ఏర్పాటు చేయాలి.
- ఆలపాడు నుంచి కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వరకు రూటు పొడిగింపు

షటిల్ సర్వీసులు పునరుద్ధరించాలి



ఆర్టీసీ అధికారులు షటిల్ సర్వీసులను పునరుద్ధరించాలి. కలిదిండి నుంచి కైకలూరు ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తారు. కలిదిండిలో మారుమూల గ్రామాలను కలుపుతూ కైకలూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. ప్రధానంగా కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు దృష్ట్యా ఉదయం బస్సు సర్వీసులు పెంచాలి.

– షేక్ చాన్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్, కలిదిండి

బస్సులు ఆపడం లేదు



కైకలూరులో కాలేజీలకు వెళ్ళడానికి రోడ్డుపై నిలుచుంటే ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు. విద్యార్థుల ఎక్కువగా ఉండటంతో పాటు ఉచిత బస్సు నేపథ్యంలో ఉదయం కిక్కిరిసిపోతుంది. ఆర్టీసీ బస్సు పాస్‌లు తీసుకున్నా అనేక సందర్భాల్లో బస్సులు ఆపకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నాం. బస్సుల సంఖ్య పెంచాలి.

– పి.సిద్దు, విద్యార్థి, మండవల్లి

వాహన మిత్ర గడువు పొడిగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏలూరు (టూటౌన్) : వాహన మిత్ర దరఖాస్తు గడువు అక్టోబరు 3 వరకు పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల అమర్ కుమార్, జె.గోపి మాట్లాడుతూ వాహన మిత్ర పథకం దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలని, లైసెన్స్ కలిగిన ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఫ్రీ బస్సు పథకం వలన నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకునేలా సాధికారిక బోర్డును ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బి.చంద్రశేఖర్, ఎం.ఇస్సాకు పాల్గొన్నారు.

ఇరిగేషన్ భూములు ఆక్రమిస్తే చర్యలు

కైకలూరు: ఇరిగేషన్ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కైకలూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈ ఎం.శిరిష హెచ్చరించారు. కైకలూరు – కోరుకొల్లు రహదారిలో ప్రభుత్వ ఇరిగేషన్ భూమి ఆక్రమణపై 'కూటమి నేతల కబ్జాల పర్వం' శీర్షికతో సాక్షిలో శుక్రవారం కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై డీఈ శిరిష, ఏఈ కేవీ.సత్యనారాయణ స్పందించారు. ఆక్రమించుకున్న భూమిని పరిశీలించి సిబ్బందితో కొలతలు వేయించారు. డీఈ మాట్లాడుతూ ఇరిగేషన్ భూమిని ఆక్రమించుకున్నారని నిర్ధారించామన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేయడం నేరమన్నారు. వాచ్‌డాగ్ పేరుతో ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోడానికి కలెక్టర్, ఆర్డీవో అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ జరిగిన విషయాన్ని కమిటీతో పాటు స్థానిక తహసీల్దారు, గ్రామ పంచాయతీకి తెలియజేస్తామన్నారు.

సాక్షి ఎఫెక్ట్



ఇరిగేషన్ ఆక్రమణ భూమిలో కొలతలు వేయిస్తున్న డీఈ శిరీష

విద్యార్థిని తీవ్రంగా కొట్టిన టీచర్



దెబ్బలు చూపిస్తున్న విద్యార్థి

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయుడు తీవ్రంగా కొట్టాడు. తంగెళ్ళమూడి దాదా పలావు సెంటర్ సమీపంలోని శ్రీసరస్వతి విద్యానికేతన్ స్కూల్లో ఇద్దం అహల్ అనే 6వ తరగతి చదువుతున్నాడు. అహల్‌కు కొన్ని పదాలు సరిగా పలకక ఇబ్బంది పడుతూ ఉంటాడు. ఈ నెల 18న స్కూల్లో పాఠం చెబుతున్న సందర్భంలో డి అనే అక్షరం పలకలేకపోవడంతో బాలుడిని టీచర్ బెత్తంతో విచక్షణారహితంగా కొట్టాడు. శుక్రవారం ఉదయం బాలుడు స్నానం చేస్తుండగా గమనించిన తల్లిదండ్రులు ప్రశ్నించటంతో ఉపాధ్యాయుడు కొట్టినట్లు చెప్పాడు. పాఠశాలకు వెళ్ళి ఉపాధ్యాయుడిని నిలదీయగా వారిని దుర్భాషలాడాడు. వారు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని విచారించారు.

ఆందోళన బాటలో వీఆర్‌ఏలు

- రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నాలు, ఆందోళనలు
- అరకొర వేతనాలతో ఇక్కట్లు



నరసాపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

నరసాపురం రూరల్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఆర్‌ఏలు ఆందోళన బాట పట్టారు. కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హతను బట్టి వీఆర్‌వో, అటెండర్స్, వాచ్‌మెన్, డ్రైవర్, నైట్ వాచ్‌మెన్‌లుగా పదోన్నతి కల్పించాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని కోరుతూ ధర్నాలు చేస్తున్నారు.

2014 నుంచి వేతనాలు పెంచలేదని, ప్రభుత్వం ఇచ్చే వేతనాలు ఏ మూలకు సరిపోవడం లేదని, కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ వీఆర్‌ఏల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదు. తెలంగాణలో ఇచ్చినట్లే మన రాష్ట్రంలో కూడా వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా వారు కనికరించడం లేదని వీఆర్‌ఏలు వ్యక్తం చేస్తున్నారు. వీఆర్‌ఏలకు పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శిస్తున్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించడం లేదని పేర్కొంటున్నారు. ఎప్పటికైనా వీఆర్‌వో ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని, స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో రెండు రోజులపాటు ధర్నా నిర్వహించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్డీవో, సబ్ కలెక్టర్ కార్యాలయాల ఎదుట, 22న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో సుమారు వెయ్యిమంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు.

జీతాలు పెంచాలి



మా తాత, తండ్రి, నేను రెవెన్యూ శాఖలో తరతరాలుగా పని చేస్తున్నాం. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. పేరుకు మాత్రం పార్ట్ టైం వీఆర్‌ఏ ఉద్యోగం. రాత్రి, పగలు తేడా లేకుండా మాతో పని చేయించుకుంటున్నారు. పనికి తగ్గ వేతనం అందడంలేదు. మా జీతాలు పెంచి మమ్మల్ని ఆదుకోవాలి.

– ఆకుల రాఘవులు, లిఖితపూడి వీఆర్‌ఏ

పదోన్నతి కల్పించాలి



నేను 2014లో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికై వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాను. కారుణ్య నియామకంలో ఉద్యోగంలో చేరిన వారికి, నా లాంటి వారికి అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఉన్న ఖాళీలలో ముందుగా వీఆర్‌ఏలతో భర్తీ చేయాలి.

– నీలం సుబ్బలక్ష్మి, వీఆర్‌ఏ

వీఆర్‌ఏలను ఆదుకోవాలి



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాను. మాకిచ్చే జీతంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. జీతాలు పెంచి మా కుటుంబాలను ఈ ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాపాక ప్రసాదరావు, అధ్యక్షుడు, మండల వీఆర్‌ఏల సంఘం

పే స్కేలు అమలు చేయాలి



తెలంగాణలో మాదిరిగా ఏపీలోనూ వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలి. ఏళ్ల తరబడి పదోన్నతులు లేక వీఆర్‌ఏలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలి.

– మోటూరి మోషే, వీఆర్‌ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు

నేటి నుంచి అందుబాటులోకి మరో బస్సు

శ్రీవారి భక్తులకు తప్పనున్న ప్రయాణ కష్టాలు



ముస్తాబైన ధర్మ పరిరక్షణ రథం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానానికి చెందిన మరో ఉచిత బస్సు సేవలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నెల రోజుల క్రితం మరమ్మతులకు గురైన ధర్మ పరిరక్షణ రథం (బస్సు)ను రూ.2.20 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి కొండపైన వాహన పూజల వద్ద శుక్రవారం ఈ బస్సుకు పూజలు నిర్వహించి, కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. శనివారం నుంచి ఈ బస్సును భక్తులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఎప్పటి నుంచో ఉచితంగా నడుపుతున్న 42 సీట్ల సామర్థ్యం గల ధర్మ రథం భక్తులకు చాలడం లేదు. దాంతో స్వామివారి ప్రచార రథం వెంట వినియోగించే 41 సీట్ల ధర్మ పరిరక్షణ రథన్ని వాడుతున్నారు. నెల క్రితం ఈ బస్సు మరమ్మతులకు గురవడంతో, 33 సీట్ల సామర్థ్యం గల ఉచిత చిన్న బస్సును నడుపుతున్నారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో ఇకపై దేవస్థానం ఈ మూడు ఉచిత బస్సులను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నడపనుంది. సాధారణ రోజుల్లో ధర్మ రథం మాత్రమే తిరుగుతుంది.

22 నుంచి 'వైనాట్'లో జీఎస్టీ తగ్గింపు ధరలు



తగ్గింపు ధరల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఎలక్ట్రానిక్ పరికరాలపై తగ్గించిన జీఎస్టీ ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తుండడంతో వైనాట్ షోరూంలలో ఎలక్ట్రానిక్ సామగ్రిని తగ్గింపు ధరలకు విక్రయించనున్నట్లు వైనాట్ అధినేత జుజ్జువరపు వెంకటరాయుడు తెలిపారు. తణుకు వైనాట్ షోరూంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తగ్గింపు ధరలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎల్‌ఈడీ టీవీలు, ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషర్, ఇన్వర్టర్ బ్యాటరీలపై 28 నుంచి 18 శాతానికి జీఎస్టీని తగ్గించినట్టు చెప్పారు. ఈ నెల 22న దసరా శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా వైనాట్ షోరూంలో ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నామని, దీంతో మరింత తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చని తెలిపారు. రూ.10 వేలకు పైబడి కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికి లక్కీ పాట్ ద్వారా కచ్చితమైన బహుమతి లభిస్తుందని వివరించారు. ఈ శుభ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవరాత్రులకు సిద్ధం

- మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఉత్సవాలు
- జిల్లా వ్యాప్తంగా మొదలైన పండుగ సందడి
- తుది దశకు అమ్మవారి మట్టి విగ్రహాల తయారీ



అమ్మవారి విగ్రహానికి రంగులతో తుది మెరుగులు దిద్దుతున్న నాగేశ్వరరావు

ద్వారకాతిరుమల: అమ్మలగన్న అమ్మ.. శ్రీ కనక దుర్గమ్మ దసరా ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. పండుగకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లా వ్యాప్తంగా సందడి మొదలయ్యింది. ఉత్సవాల్లో పూజలందుకోనున్న అమ్మవారి విగ్రహాల తయారీ ఊపందుకుంది. ఏలూరు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం వంటి పట్టణాలతో పాటు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి తదితర గ్రామాల్లో కళాకారుల కుటుంబాలు రాత్రింబవళ్లు శ్రమిస్తూ దుర్గాదేవి విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. పండుగ దగ్గర పడడంతో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏటా 9 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, తిథుల్లో హెచ్చుతగ్గుల కారణంగా ఈ సారి 11 రోజుల పాటు జరగనున్నాయి. ఆలయాల్లోనే కాకుండా ఈ ఉత్సవాలను గ్రామ గ్రామన నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సిద్ధమవుతున్నారు. ఈనెల 22న ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చేనెల 2 వరకు వైభవంగా జరగనున్నాయి.

మట్టి విగ్రహాలే మేలు

కళాకారులు అమ్మవారి విగ్రహాల తయారీలో బిజీబిజీగా ఉన్నారు. కొందరు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తుంటే.. మరి కొందరు పర్యావరణాన్ని పరిరక్షించే మట్టితోనే తయారు చేస్తున్నారు. ప్రస్తుతం విగ్రహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. పర్యావరణ ప్రేమికులు ఖర్చును సైతం లెక్క చేయకుండా మట్టి విగ్రహాలను ఆర్డర్లపై తయారు చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎం.నాగులపల్లి లోని జాతీయ రహదారి పక్కన ఈ అమ్మవార్ల విగ్రహాలను తయారు చేస్తున్నారు. భీమడోలు మండలం పాలసానిపల్లి గ్రామానికి చెందిన పేరవరపు నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యుల సహాయంతో నెల ముందు నుంచే ఈ మట్టి విగ్రహాల తయారీ పనులను చేపట్టారు. ప్రత్యేక ఆర్డర్లతో పాటు, మరికొన్ని విగ్రహాలను అదనంగా తయారు చేస్తున్నారు. సైజును బట్టి ఒక్కో విగ్రహాన్ని రూ. 8 వేల నుంచి, రూ. 15 వేలకు విక్రయిస్తున్నారు. భీమడోలు, ఏలూరు, తాడేపల్లిగూడెం, దూబచర్ల, గోపాలపురం తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ఈ విగ్రహాలను ఇప్పటికే కొనుగోలు చేశారు.

తగ్గుతున్న డిమాండ్



ఎంతో భక్తి శ్రద్ధలతో దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తున్నాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు అందంగా ఉండడం వల్ల మట్టి విగ్రహాలకు నానాటికి డిమాండ్ తగ్గుతోంది. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలు తెలుసుకోవాలి. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మట్టి విగ్రహాల తయారీదారులను ప్రోత్సహించాలి.

– పేరవరపు నాగేశ్వరరావు, విగ్రహాల తయారీ దారుడు, ఎం.నాగులపల్లి

పనుల్లేక పస్తులు

- బిల్లులు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- ఏడాదిగా నిలిచిన భవన నిర్మాణాలు
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వేదన

ఇరగవరం : కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు కూలీ పని లేకుండా పోయింది. ప్రధానంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సచివాలయ సముదాయాలకు బిల్లులు నిలిపివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంఓ పేదలకు సొంతింటి కలను సాకారమే చేయడమే లక్ష్యంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న లేఅవుట్లు వేసి స్థలాలతోపాటు ఇళ్లను మంజూరుచేశారు. దాంతో భవన నిర్మాణ కార్మికులకు సొంత ఊరిలోనే నిత్యం కూలీ లభించేది. ఐదేళ్ల పాటు ఖాళీలేకుండా ఉపాధి పొందారు. దాదాపు నిర్మాణాలు పూర్తయినప్పటికీ కొంత మేర పనులు కొనసాగుతున్న క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇళ్లతోపాటు సచివాలయ భవనాలకు బిల్లులు చెల్లించక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీనికితోడు కొత్తగా ఇళ్లను మంజూరు చేసిన పాపానా పోలేదు. దాంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1570 ఇళ్ల నిర్మాణాలకు నిలిచిన బిల్లులు

జిల్లా కేంద్రంగా ఉన్న పట్టణంతో పాటు మండలంలో గత ప్రభుత్వంతో మొదలైన భవన నిర్మాణాలు కూటమి సర్కార్ రావడంతో నలిచిపోయాయి. పనుల కోసం నిత్యం పట్టణానికి వచ్చే భవన నిర్మాణ కార్మికులు సంసఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పనులు లేక చాలా మంది కూలీలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మండలంలో జగనన్న లేఅవుట్‌లో మొత్తం 2713 గృహాలు మంజూరైతే 1570 ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు చెల్లింపు కాక వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. అప్పులు చేసి పూర్తి చేయలేక లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిపివేశారు.

పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులు

మండుటెండలో సైతం ఓర్చుకుని నిర్మాణ పనులు చేసి భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అనేక భవనాలకు బిల్లులు చెల్లింపును కూటమి ప్రభుత్వం నిలినివేసింది. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణ మేస్త్రీలు రోజుకు రూ.వెయ్యి, మగ కూలీ రూ.750, మహిళా కూలీరూ.600 కూలీ రాగా వారి ఖర్చులు పోను కనీసం రూ.500 ఇంటికి తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వంలో ఎటువంటి పనులు లేకపోవడంతో పిల్లల చదువులు, కుటుంబ జీవనానికి డబ్బులు లేక అప్పులపాలవుతున్నామని భవన నిర్మాణ కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఇరగవరంలో నిలిచిపోయిన జగనన్న కాలనీ ఇళ్లు

ఏడాదిన్నరగా ఏ పనీ లేదు



నేను భవన నిర్మాణ మేస్త్రీని. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే కూలీలకు పనులు అప్పగిస్తాను. ఒప్పందాలు చేసుకుంటూ చేతిలో కనీసం రెండు, మూలు ఇళ్లు నిర్మాణ పనులతో తీరికలేకుండా ఉండే వాడిని. ఏడాదిన్నర కాలంగా ఖాళీ ఉంటున్నారు. నాతో పాటు నన్ను నమ్ముకున్న కూలీలకు పనులు చెప్పలేని విధంగా ఉంది. భవన నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి.

– వసంతాడ గిరీష్, తాపీ మేస్త్రి , ఇరగవరం

ఇళ్ల నిర్మాణాలు లేక ఖాళీగానే ఉంటున్నాం



కొన్ని నెలలుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. రెక్కాడితే గాని డొక్కాడని మాకు వారంలో ఒక్క రోజూ పని దొరకడం లేదు. ఇసుకతో పాటు ఇతర సిమెంట్, ఇనుము ధరలు అధికంగా ఉండటం. ప్రభుత్వ సహాకంర లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే ఆలోచన కూడా ఎవరూ చేయడం లేదు. కరోనా సమయంలో పన్లులేక పడిన కష్టాలే ఇప్పుడు పడుతున్నాం.

– చదలవాడ నాగరాజు, కంతేరు తాపీ కార్మికుడు

క్లుప్తంగా

సుబ్బారావుపేట స్కూల్‌లో జాషువా జయంతి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక సుబ్బారావుపేటలో మునిసిపల్ హైస్కూల్‌లో శుక్రవారం సామాజిక సమరసత వేదిక, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, సామాజిక వేత్త గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. వ్యాసరచన పోటీలు జరిగాయి. అనంతరం బహుమతులు ప్రధానం చేశారు. సమరసత వేదిక రాష్ట్ర నాయకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, గోదావరి విభాగ్ సంయోజక్ సన్నిధి ప్రసాద్, సభ్యులు శ్రీ లీల, చేకూరి బంగ్రారాజు, శరత్, సతీష్, కిషోర్, హెచ్ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి


మునిసిపల్ హైస్కూలులో హ్యాండ్ వాష్ దినోత్సవం

తాడేపల్లిగూడెం: విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మాగంటి అన్నపూర్ణ, కోడే వెంకట్రావు హైస్కూల్‌లో హ్యాండ్స్ వాష్ గురించి కమిషనర్ విద్యార్థులకు వివరించారు. గుడ్డ సంచులు వాడకం, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ మేనేజర్ ఎస్.రాజు, మేనేజర్ రవిసుధాకర్, మునిసిపల్ ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


నిట్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి కోరారు. యాక్సిస్ బ్యాంకు, ఏపీ నిట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిట్‌లో వైద్య శిబిరం జరిగింది. శిబిరాన్ని రిజిస్ట్రార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. మ్యాక్సీ విజన్, ఇంపీరియల్ ఆసుపత్రి, విజయశ్రీ ఆసుపత్రులకు చెందిన వైద్యులు సేవలందించారు. 220 మంది పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. నిట్ అధికారులు హిమబిందు, శ్రీనివాసన్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు


రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

పెనుగొండ: తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పి.మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం ఆచంట మండలం వల్లూరులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. డ్రోన్ టెక్నాలజీతో రైతులకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. కోడి గుడ్లు నిమ్మరసం కలిపిన ద్రావణాన్ని డ్రోన్ సహాయం స్ప్రే చేయించారు. మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ పరిసర విశ్లేషణపై అవగాహన కల్పించారు.

ప్రమాదకరంగా వడలి రహదారి

పెనుగొండ: పెనుగొండ వడలి రహదారి ప్రమాదకరంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే పాదుషా ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం పెనుగొండ వడలి రహదారిలో గోతులమయంగా మారిన ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వర్షం వస్తే చాలు చెరువుల్లా మారుతున్న గోతులతో వాహనదారులు నానావస్థలు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరో ప్రయాణికులు గోతుల్లోపడి గాయాల పాలవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు సత్వరం స్పందించి గోతులు పూడ్చి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన తూర్పు విప్పర్రు విద్యార్థులు

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పర్రు ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఈతల పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయని వి.సుమలత తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదిన ఏలూరు ఏఎస్‌ఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఈతల పోటీల్లో తూర్పు విప్పర్రు ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అండర్ 17 విభాగంలో ఎ ధనుంజయ్, పి బాబి, జి కృష్ణ తేజ, ఎస్ కిరణ్ కుమార్లు ఎంపిక కాగా, అండర్ 14 విభాగంలో టిహెచ్ సత్యనారాయణ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.ఉషశ్రీ, గ్రామ సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ, ఆకేటి నరసింహరావు, మండల జనసేన అధ్యక్షుడు ఆకేటి కాశీ, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ జడ్డు నరసింహమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి


అత్తిలి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

అత్తిలి: అర్హత కల్గిన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు కల్పించాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు బుంగా గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు లంకపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వో, అటెండర్, నైట్ వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవరు తదితర ఖాళీ పోస్టులలో ప్రమోషన్లు కల్పించాలని, పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిబంధనలకు విరుద్ధంగా అదనపు పని భారం మోపుతోందని, బలవంతంగా నైట్ డ్యూటీలు చేయిస్తున్నారని, రీ సర్వేల పేరిట వీఆర్‌ఏల శ్రమను దోచుకుంటూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నా ప్రభుత్వం కనీసం టీఏ,డీఏలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏల విధి విధానాలకు తిలోధకాలు ఇచ్చి అదనపు పని భారం మోపడం చట్ట విరుద్ధమని, వెంటనే అదనపు పని భారం నుంచి వీఆర్‌ఏలకు విముక్తి కల్పించాలన్నారు. దాదాపు 9 సంవత్సరాల నుంచి జీతాలు పెరగక వీఆర్‌ఏలు అవస్థలు పడుతున్నారని ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న విధంగా పేస్కేల్ వేతనాలు చెల్లించాలని, అధికారంలోకి వస్తే వేతనాలు పెంచి వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తానన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీని నిలబెట్టుకుని, వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దశిక వంశీకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామ రెవెన్యూ సహాయకులు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ యూనియన్ నాయకులు తాడేపల్లిగూడెం డివిజన్ అధ్యక్షుడు చదలవాడ రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీఏవీ పండు, వైస్ ప్రెసిడెంట్ రాపాక ఏసురత్నం, బుల్లబ్బాయి, క్రాంతి, దేవి,ధనలక్ష్మి, బేబీ, లక్ష్మి, రామకృష్ణ, బాలయ్య, సుబ్బయ్య, సుబ్బారావు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణ పురుషుని బాధ్యత


జగన్నాథపురం-2 సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల ఆరోగ్య సంరక్షణ పురుషుని బాధ్యత అని జగన్నాథపురం సర్పంచ్ ఉంద్రాజవరపు చంద్రిక అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో స్వస్థ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలతో మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తుందన్నారు. మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సింధు మాట్లాడుతూ మహిళల ఆరో గ్య రక్షణ, సమగ్ర శక్తివంతమైన కుటుంబనిర్మాణం, ఆరోగ్యకరమైన సమాజ సృష్టి, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం 152మందికి బీపీ సుగర్, జనరల్ వ్యాధులకు పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్


దస్తావేజు లేఖర్ల నిరసన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీటీసీ): జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమానికి దస్తావేజు లేకరులు పిలుపునిచ్చారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన 2ఓ స్టాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలతో ఇబ్బందులు తెలెత్తుతున్నాయని దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం స్టేట్ అసోసియేషన్ గౌరవధ్యక్షుడు బీఎస్‌వీ సుబ్బారావు తెలిపారు. సదరు విధానంలో మార్పులు చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తూ పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనికి ప్రజలంతా సమకరించాలని కోరారు. దీంతో ఆయా కార్యాలయాల్లో అధిక శాతం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయే అవకాశం ఉంది. ఆ దిశగా ఇప్పటికే క్రయవిక్రదారులకు దస్తావేజు లేఖర్లు సమాచారం పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ప్రెసిడెంట్ పెదగాడి సూర్యం, సెక్రటరీ యడ్లపల్లి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి


యర్రాయి చెరువు పంచాయతీ వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


గుమ్మంపాడులో పోషణ మహా కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఇరగవరం: ప్రత్యేక ఉచిత వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఇరగవరం పీహెచ్‌సీ వైద్యులు మౌనిక తెలిపారు. ఇరగవరం పీహెచ్‌సీలో శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జుత్తి వెంకట మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 105మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్‌కె ఖాన్ సాహెబ్, టిబి సూపర్‌వైజర్ ఆర్ ఎస్ చైతన్య, పి రవిబాబు, సూపర్‌వైజర్లు, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ కార్యదర్శి సి వీర్రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అత్తిలి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో పోషణ మహా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని కోరారు. తల్లిపాల ప్రాధాన్యతను తెలిపారు. పురుషులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త ఎం రాజకుమారి సహాయకులు పాల్గొన్నారు.

కె ఎస్ గట్టులో...

అత్తిలి మండలం కె సముద్రపుగట్టు సచివాలయంలో పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పురుషులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. తల్లిపాల ప్రాధాన్యత, స్వచ్ఛమైన వాతావరణం, పిల్లలకు తగిన పోషణ అంశాలపై వివరించారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అత్తిలి సూపర్‌వైజర్ ఎం విజయకుమారి, గ్రామ సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ ఉడతల నరేష్, మెంతు రాజ్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు దీపికారాణి, పూర్ణగిరి, నవోమి పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు

ఇరగవరం: మండలంలోని అశ్లీల నృత్యాలు చేసిన వారిని అరెస్టు చేసి ఘటన ఇరగవరం మండల రేలంగి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ జానా సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేలంగి గ్రామానికి చెందిన పసుపులేటి కుమారస్వామి, పసుపులేటి రామాంజనేయులు, యర్రంశెట్టి రవి, షేక్ ఇస్మాయేలు, షేక్ ఖాదర్ అలియాస్ ఎండీ ఖాదర్, మరికొంత మంది వ్యక్తులు గురువారం అర్ధరాత్రి 1గంట సమయంలో కొంత మంది ట్రాన్స్ జండర్లలతో రేలంగి రంగి శెట్టి వారి వీధిలో అశ్లీల నృత్యాలు చేస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు. అశ్లీల నృత్యాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామాల్లో ఇలాంటివి జరుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లురావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవరాత్రుల్లో మహిషాసురమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించనున్నట్లు వివరించారు. 22న శ్రీబాల, 23న రాజరాజేశ్వరి, 25ల లలితా దేవి, 25న బాలా త్రిపుర సుందరి, 26న లక్ష్మీదేవి, 27న అన్నపూర్ణాదేవి, 28న గాయత్రి దేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, 1న మహిషాసుమర్దనీ రూపాల్లో అలంకరిస్తారన్నారు. 2న నిజరూప దర్శనం ఉంటుందన్నారు.

ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి


కౌలు రైతుల సమస్యలు తెలుసుకుంటున్న రైతు సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్వచ్ఛంద పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురావడం వల్ల కౌలు రైతులకు అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంటపాడు మండలంలోని ఆకుతీగపాడు, కస్పాపెంటపాడు, యానాలపల్లి తదితర గ్రామాలలో కౌలు రైతుల సమస్యలపై జమలయ్యతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రాంబాబు, కౌలు రైతుల సంఘం నాయకులు వంక అప్పారావు, కొణతాల నాగరాజు బృందం శుక్రవారం ఆయా గ్రామాలను పర్యటించారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి భూ యజమాని అంగీకరించడం లేదని, పంట రుణాలు ఇవ్వకపోవడం చేత పంటల బీమా పథకంలో చేరలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనల్లో కౌలు రైతులకు ఎక్కువ మందికి గుర్తింపు కార్డు జారీ కాలేదని, కార్డులు వచ్చిన వారికి కూడా పంట రుణాలు ఇవ్వకపోవడంతో పంట బీమా పథకంలో చేరలేకపోయారన్నారు. బీమా ప్రీమియం భారంగా మారిందని వెల్లడించారు.

ఉద్యాన విద్యార్థుల ప్రతిభ


ఉద్యాన వర్సిటీలో విద్యార్థుల అభినందన కార్యక్రమంలో అధికారులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన వర్సిటీ లోని ఉద్యానకళాశాలల విద్యార్థులు ప్రతిభతో అనేక రంగాల్లో రాణిస్తున్నారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఏవీ.దొరాజీరావు అన్నారు. జాతీయస్థాయిలో ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్యాన వర్సిటీ విద్యార్థులు మంచి ర్యాంకులు ఐసీఏఆర్ పోటీపరీక్షల్లో ఘన విజయం సాధించి ఉద్యానవర్సిటీకి మంచి ఖ్యాతి తీసుకొచ్చారని శుక్రవారం ఉద్యాన కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యాన కళాశాల విద్యార్థులు పి.జ్యోతిర్మయి ఉద్యా న శాస్త్రంలో ఐదవ ర్యాంకు , ఫిజికల్ సైన్స్‌లో ఏ.గంగా వరప్రసాద్ 14వ ర్యాంకు, ప్లాంట్ సైన్సులో ఏ.వీర సూర్య పవన్ 30 వర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. వేలాది మంది విద్యార్థులు రాసిన ఈ పరీక్షలో ఉద్యానవర్సిటీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు.అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం


కె ఇల్లిందలపర్రులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు


చినతాడేపల్లి గ్రామంలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ చిట్టూరి కాశీ విశ్వనాథం

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మిషన్ శక్తిలో భాగంగా పోషణ పక్షోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ రేలంగి సెక్టర్ సూపర్‌వైజర్ మాణిక్యంబ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టాల గురించి వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణవేణి, వీఆర్‌వోలు, డ్వాక్రా సీఏలు, మహిళలు అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారాన్ని ప్రోత్సహిద్దాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పోషకాహార లోపాన్ని పరిష్కరించడం కోసం సమతుల్య ఆహారాన్ని ప్రోత్సహిద్దామని మునిసిపల్ కమీషనర్ ఏసుబాబు అన్నారు. వన్‌టౌన్‌లోని వీకర్స్‌కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. పోషకాహార పదార్థాల స్టాల్స్‌ను నిర్వహించారు. డీఐఓ డాక్టర్ సుధారాణి, డాక్టర్ అనూష, డాక్టర్ తనూజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.విశాలాక్షి, సీహెచ్ దుర్గాభావాని, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు, ఆశాలు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలు చిన్న వయస్సు నుంచే పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని చినతాడేపల్లి ఉప సర్పంచ్ చిట్టూరి కాశి సూచించారు. శుక్రవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుములు, రాగులు, సజ్జలు, కొర్రలు వంటి చిరు ధాన్యాల్లో శరీరానికి అవసరమైన పోషకాలు మెండుగా ఉన్నాయన్నారు. మహిళలు తమ ఆహారంలో ఒక భాగంగా తీసుకోవాలన్నారు. అనంతరం పురుషుల సమక్షంలో పోషకాహార వంటల పోటీలు నిర్వహించారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రూపాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.